క్లుప్తంగా

ఆర్టీసీ మంథని డిపో సందర్శన



ఆర్‌ఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎం శ్రావణ్

మంథని: మంథని ఆర్టీసీ డిపోను మంగళవారం కరీంనగర్ రీజనల్ మేనేజర్ రాజు సందర్శించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. ఉద్యోగులు కష్టపడి డిపోలను లాభాల బాటలోకి తీసుకురావాలని, బస్సుల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

మానవ హక్కులపై అవగాహన

కోల్‌సిటీ: మానవ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గోదావరిఖని మార్కండేయ కాలనీలో హ్యూమన్ రైట్స్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మన హక్కులు– మన భవిష్యత్తు అనే అంశంపై అవగాహన కల్పించారు. నాయకులు ఎండీ.ఇబ్రహీం, ఎల్లబోయిన మల్లికార్జున్, బుద్దె గోవర్ధన్, ప్రముఖ న్యాయవాది దూడపాక లింగస్వామి, అవినాశ్, రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో, ఎంపీడీవో

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఎంఈవో ఓదెలు, ఎంపీడీవో సురేశ్ ప్రారంభించారు. మండలంలోని మోడల్ స్కూల్, అడవిశ్రీరాంపూర్, ముత్తారం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని ఎంఈవో తెలిపారు. బుధవారం కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. ఈనెల 12 వరకు జరగనున్న పోటీల్లో గెలుపొందిన వారు జిల్లాకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. ముత్తారం జెడ్పీ హెచ్‌ఎం పద్మావతి ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న హోంగార్డులు

గోదావరిఖని: హోంగార్డుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రకటన చేసినందున సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. హోంగార్డుల రోజువారీ వేతనం రూ.వెయ్యికి పెంపు చేయడంతో పాటు, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.200కు పెంపు 2025 జనవరి 1 నుంచి హోంగార్డులకు వర్తింపజేస్తానని సీఎం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. హోంగార్డు ఆర్‌ఐ మల్లేశం, పెద్దపల్లి జోన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ మనోహర్, హోంగార్డ్స్ పీఎల్‌సీ సత్యనారాయణ, కుమార్, బ్రహ్మచారి, శ్రీనివాస్, నర్సయ్య, చంద్రమౌళి, రాము పాల్గొన్నారు.

ఉద్యమకారుడి నేత్రాలు సజీవం

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నేత్రదాత దేవి చంద్రయ్య సంస్మరణ సభలో మంగళవారం సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు కుటుంబసభ్యులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు ప్రదానం చేసి సత్కరించారు. ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి మాట్లాడుతూ దేవి చంద్రయ్య చిరస్మరణీయుడని, ఆయన కళ్లు ఇద్దరికి చూపునిచ్చాయని కుటుంబసభ్యులను అభినందించారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారులు, మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవీ లక్ష్మీనర్సయ్య, కన్నాల మాజీ ఎంపీటీసీ దేవి ప్రవంతి, చింతకింది కనకయ్య, కాసర్ల రాజేశ్వరి, నేత్రదాత కుటుంబ సభ్యులు రమాదేవి, సింధు, దేవి శ్రీనివాస్, లావణ్య, దేవీ వినీత్ ఉన్నారు.

నేటి నుంచి సీఎం కప్ మండలస్థాయి పోటీలు

పాలకుర్తి: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహించే సీఎం కప్ మండల స్థాయి పోటీలు బుధ, గురువారాల్లో నిర్వహిస్తామని, ఔత్సాహికులైన క్రీడాకారులు వారి వివరాలు నమోదు చేసుకొని క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. మండల స్థాయి క్రీడాపోటీలు బసంత్‌నగర్ క్లబ్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నాట్లు పేర్కొన్నారు.

పల్లె దవాఖానాలో సిబ్బంది కరువు

- రోగులకు తప్పని ఇబ్బందులు



ధూళికట్ట పల్లె దవాఖానా

ఎలిగేడు: పల్లె దవాఖానాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని చెప్పన్న ప్రభుత్వాలు ఆచరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలోని ధూళికట్ట పల్లె దవాఖానాలో సరైన వైద్యసిబ్బంది లేకపోవడంతో రోగులు ఇక్కట్లు పడుతున్నారని స్థానికంగా విమర్శలు వినవస్తున్నాయి. ఈ దవాఖానాలో డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్రావణి గత ఆగస్టులో కాల్వశ్రీరాంపూర్‌కు, ఫస్ట్ ఏఎన్‌ఎంగా పనిచేసిన దేవేంద్ర ఎలిగేడుకు బదిలీపై వెళ్లారు. దీంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. సెకండ్ ఏఎన్‌ఎంగా ఉన్న లత, ఇద్దరు ఆశా కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. పల్లె దవాఖానా పరిధిలోకి ధూళికట్ట, నేతకానిపల్లి, ముప్పిరితోట, మల్లయ్యపల్లి, లోకపేట గ్రామాల ప్రజలు చిన్నారులకు ఇమ్యూనైజేషన్ టీకాల కోసం వస్తుంటారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీగా ఉన్న డాక్టర్, ఫస్ట్ ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అవినీతిరహిత కార్యాలయంగా గుర్తింపు రావాలి



సబ్ రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మద్దెల దినేశ్

రామగుండం: ఎన్నో పోరాటాల ఫలితంగా రామగుండం కేంద్రంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సాధించుకున్నామని, స్థానిక దస్తావేజు లేఖరులను స్థానికేతర లేఖరులు ఇబ్బందులు సృష్టిస్తే సహించేది లేదంటూ సీపీఐ ప్రజాసంఘాల ప్రతినిధులు అన్నారు. రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అవినీతి రహిత కార్యాలయంగా గుర్తింపు తీసుకురావాలని కోరారు. కాగా రామగుండం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బనావత్ తిరుపతినాయక్‌ను మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ప్రజా సంఘాల ప్రతినిధి మద్దెల దినేశ్ మాట్లాడుతూ గతంలో జిల్లా కేంద్రంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్నప్పటికీ అధిక శాతం రామగుండం కేంద్రంగా ఉన్న భూ రిజిస్ట్రేషన్లు అయ్యేవన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వారి సౌకర్యార్థం రామగుండంలోనే కార్యాలయం ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో ప్రజాసంఘాల ప్రతినిధులు విన్నవించడంతో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనర్ శేషాద్రికి ఆదేశాలిచ్చారని గుర్తు చేశారు. కార్యాలయంలో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రజా సంఘాల ప్రతినిధులు తొడుపునూరి రమేశ్‌కుమార్, ఎంఏ.గౌస్, రాజయ్య, ప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

నిజాయితీకి సన్మానం



సన్మానిస్తున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిరూరల్: నగలు ఉన్న హ్యాండ్ బ్యాగ్ తన దొరకగానే పోలీసులకు అందించిన వ్యక్తికి మంగళవారం పోలీసులు సన్మానించారు. వివరాల్లోకి వెళ్తే ఈనెల 4న పెద్దపల్లి మండలం చందపల్లికి చెందిన పోశెట్టి తన కుటుంబసభ్యులతో బందంపల్లికి బైక్‌పై వెళ్తుండగా హ్యాండ్ బ్యాగ్ పడిపోయింది. బ్యాగులో బంగారు నగలు ఉన్నాయని పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావుకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈక్రమంలో బస్‌స్టేషన్ సిగ్నల్ పాయింట్ నుంచి బందంపల్లి ఫ్లై ఓవర్ మార్గంలో బ్యాగు పడిపోయిందని గుర్తించారు. విచారణ చేస్తుండగా శాంతినగర్ పెట్రోల్ బంక్ వద్ద పంక్చర్ దుకాణం నడిపించే అఫ్జల్ తనకు బ్యాగు దొరికిందని స్వయంగా పోలీసులను సంప్రదించి బ్యాగు అప్పగించాడు. దీంతో పోశెట్టి కుటుంబసభ్యులకు పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ బ్యాగును, బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు అందించాడు. అఫ్జల్‌ను సన్మానించారు.

సభలు, సమావేశాలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న గోమాస శ్రీనివాస్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చని హామీలు అమలు చేయాలని సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల సభలు, సమావేశాలను అడ్డుకొని ప్రశ్నిస్తామని బీజేపీ పార్లమెంటు ప్రచారక్ పోచం, పార్లమెంటు నాయకులు గోమాస శ్రీనివాస్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పట్టణంలోని శాస్త్రినగర్ వద్ద హనుమాన్, అయ్యప్పస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు మాయమైందని, నిరుద్యోగ భృతి ఎక్కడ పోయిందో నిరుద్యోగులకు సమాధానం చెప్పాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. గోమాస శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు చనిపోతున్నా.. ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన బైక్ ర్యాలీని ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, నాయకులు సోమారపు లావణ్య, సురేశ్‌రెడ్డి, రాజేశ్వరరావు, రాజన్న పటేల్, కూకట్ల నాగరాజు, అశోక్‌రావు, తిరుపతి, వెంకట్రావు, గుంటి కుమార్, రాజగోపాల్, సదయ్య, మహేందర్ పాల్గొన్నారుజ.

డ్రాప్ అవుట్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత

పెద్దపల్లిరూరల్: డ్రాప్ అవుట్ విద్యార్థుల చదువుకు పెద్దపల్లి లయన్స్ క్లబ్ ఆర్థిక సహకారం అందించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ దయ అరుణ విజ్ఞప్తి మేరకు ఆర్థిక ఇబ్బందులతో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు చదువుకునేందుకు ఆర్థికసాయం అందించారు. జంగపల్లి అన్వేష్, పోలం రాకేశ్‌కు ఓపెన్ టెన్త్ ద్వారా చదువు కొనసాగించడానికి అడ్మిషన్ ఫీజు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున రూ.4వేలు లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి సెక్రటరీ లయన్ బోడకుంట రాంకిషన్ సహకారంతో చెల్లించారు. పెద్దపల్లి శాంతినగర్ గీతాంజలి పాఠశాలలో అడ్మిషన్స్ కల్పించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 40మందిని ఓపెన్ స్కూల్ ద్వారా మళ్లీ చదువు కొనసాగించడానికి అడ్మిషన్స్ ఇప్పించామని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ప్రెసిడెంట్ లయన్ వేల్పుల రమేశ్, ట్రెజరర్ లయన్ మీసాల సత్యనారాయణ, ఇమిడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ సాదుల వెంకటేశ్వర్లు, సీనియర్ సభ్యులు లయన్ మట్ట రాంరెడ్డి, లయన్ రోహిత్, లయన్ సంతోష్‌కుమార్, గీతాంజలి స్కూల్ హెచ్‌ఎం పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం ఆందోళనకు సిద్ధం



మాట్లాడుతున్న ఇంజం వెంకటస్వామి

కాల్వశ్రీరాంపూర్: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అంశంపై కాంగ్రెస్ మాట తప్పిందని ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో వర్గీకరణకు అనుకూలమని మాట ఇచ్చిన కాంగ్రెస్ అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ అమలు చేస్తామని మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం మాట నిలబెట్టుకోవాలని, వర్గీకరణ అంశంపై స్పష్టత ఇవ్వాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రుద్రారం రాంచంద్రం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంథెన రామస్వామి, నవీన్, సాగర్, రాజనర్సు, రాజశేఖర్, సదయ్య, శ్రీకాంత్, లక్ష్మి, జగన్, స్వరూప, వివేక్, రవితేజ, ఆకాశ్, లింగస్వామి పాల్గొన్నారు.

సీఎం కప్ నిర్వహణపై సమావేశం

జూలపల్లి: మండల కేంద్రంలో ఈనెల 12 నుంచి నిర్వహించనున్న మండలస్థాయి సీఎం కప్ టోర్నమెంట్ పోటీల నిర్వహణపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో పద్మజ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో ఎంపికైన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ జట్లు పాల్గొనాలని సూచించారు. ఆటల పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. అనంతరం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. సమావేశంలో ఎంపీవో అనిల్‌రెడ్డి, పీడీ దాసరి రమేశ్, కార్యదర్శి ముజీబ్, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, ఆమని, నాగరాజు ఉన్నారు.

సమగ్రశిక్షా అభియాన్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

జూలపల్లి: సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరుతూ సిబ్బంది మంగళవారం నుంచి నిర్వహించే నిరవధిక సమ్మె నోటీసును ఎంఈవో సరస్వతికి అందజేశారు. సిబ్బంది మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె తప్పదన్నారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు, సీఆర్పీలు సతీశ్, తిరుమల, ప్రియాంక, మధు, ఐఈఆర్పీ అనిల్, పీటీఐ వెంకటస్వామి, కేజీబీవీ ఉద్యోగులు నవ్య, ఏఎన్‌ఎం లక్ష్మి, ఓఎస్ మహేశ్వరి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• బస్సు అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్టీసీ అద్దె బస్సుఅద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై మంగళవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గోదావరిఖని నుంచి కాలనీ మీదుగా ఓడెడ్‌కు వెళ్తున్న బస్సులో మద్యం సేవించి ఎక్కిన శివకుమార్ మద్యం మత్తులో బస్సులో ప్రయాణిస్తున్న వారితో గొడవ పడ్డాడు. బస్సు కాలనీ షిర్కే బస్టాప్‌కు రాగానే రన్నింగ్‌లో ఉన్న బస్సు నుంచి కిందకు దిగి బస్సుపై రాళ్లతో దాడి చేయగా బస్సు ముందు భాగంలోని అద్దాలు పగిలిపోయినట్లు పేర్కొన్నారు. వాటి విలువ దాదాపు రూ.25వేల వరకు ఉంటుందన్నారు. బస్సు అద్దాలు ధ్వంసం చేసిన శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని డ్రైవర్ బొద్దుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• నియామకం

జూలపల్లి: మున్నూరుకాపు సంఘం మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా అబ్బాపూర్‌కు చెందిన గాండ్ల హరీశ్ పటేల్‌ను నియమిస్తూ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్రం సంజీవ్ నియామక పత్రం జారీ చేశారు. మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హాలులో హరీశ్‌ను సన్మానించారు. నాయకులు కొప్పుల మహేశ్, దండె వెంకటేశం, గాండ్ల రాజు, చెంద్రయ్య, పసునూటి శ్రీనివాస్, గాండ్ల అంజయ్య, మల్లయ్య, ఆర్జయ్య, నాగరాజు ఉన్నారు.

• మున్నూరుకాపు సంఘం కమిటీకి సన్మానం

జూలపల్లి: మండల కేంద్రంలో నూతనంగా ఎన్నుకున్న మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ మంగళవారం సన్మానించారు. ఆఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మున్నూరుకాపు సంఘం భవనాన్ని మంజూరు చేసి పూర్తి చేశామన్నారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు నాడెం శ్రీధర్, గౌరవాధ్యక్షుడు గుమ్మడి శంకరయ్య, సభ్యులు బండి రాజయ్య, కటుకం మల్లయ్య, వెంకటరమణ, మండల అధ్యక్షుడు నాడెల మల్లయ్య, ఐల రాజయ్య, ఖమ్మం సతీశ్, రమేశ్, ఐల కిషన్ ఉన్నారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శానగొండ, ఇందుర్తి గ్రామాల్లో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. అనుమతిలేని వాహనాలకు జరిమానా విధించారు.

• కాంట్రాక్ట్ ఉద్యోగి మృతికి సంతాపం

ఫెర్టిలైజర్‌సిటీ: నిర్మల్ జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ స్కీమ్‌లో ఎన్‌టీఈపీ విధులు నిర్వహిస్తున్న భరత్ అనే కాంట్రాక్టు ఉద్యోగి మనస్తాపనతో ఆత్మహత్య చేసుకొని మృతి చెందారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని మంగళవారం రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ స్కీం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్‌నాయక్ మాట్లాడారు. జాతీయ ఆరోగ్య మిషన్ స్కీమ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఆఫీసర్ సరళి, హెల్త్ అసిస్టెంట్ తిరుపతి, సూపర్‌వైజర్ గోపికృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

• వైద్య సిబ్బంది నివాళి

కోల్‌సిటీ: నిర్మల్ జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఆరేళ్లుగా పని చేస్తున్న భరత్‌కుమార్ అనే ఉద్యోగి సోమవారం ఆత్మహత్య చేసుకోగా గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది మంగళవారం నివాళి అర్పించారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మెడికల్ ఆఫీసర్ మణికేశవరెడ్డి, ఏఐటీయూసీ అనుబంధ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.సురేశ్ నాయక్, లాబ్ టెక్నీషియన్ పి.శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

• ప్రభుత్వం మారింది.. పాలన మారలేదు

జ్యోతినగర్: రాష్ట్రంలో ప్రభుత్వం మారింది గానీ పాలన ఏమాత్రం మారలేదని బీజేపీ ఎన్టీపీసీ రామగుండం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటలో అన్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అందిస్తామని చెప్పి నేడు మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బుధవారం నియోజకవర్గంలోని గోదావరిఖని చౌరస్తాలో నిరసన, బైక్ ర్యాలీకి బీజేపీ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కొనుగోలు కేంద్రంలో వడ్లు చోరీ



చోరీకి గురైన వడ్ల కుప్ప చూపుతున్న రైతు

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం రాత్రి ధాన్యం కుప్పల్లో వడ్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన ఐదుగురు రైతుల ధాన్యం కుప్పల్లో సుమారు 20 క్వింటాళ్ల ధాన్యాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతోనే దొంగతనం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. దొంగలు ఎత్తుకెళ్లిన ధాన్యం విలువ సుమారు రూ.50వేలు వరకు ఉంటుందని వారు వాపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బాధితులు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.



రామగుండం: టీటీఎస్ అంతర్గాం బస్‌షెల్టర్ వెనుక వైపు ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. కానీ కనీసం రెండు రోజులు కూడా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. పాలకులు, అధికారులు స్పందించి సదరు పబ్లిక్ టాయిలెట్స్ వినియోగంలోకి తీసుకురావాలని, ప్రజల కనీస అవసరాలు తీర్చాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

నాణ్యమైన బొగ్గు అందించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం వెంకటయ్య, అధికారులు

గోదావరిఖని: వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం ద్వారానే సంస్థపై విశ్వాసం పెరుగుతుందని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. ఓసీపీ–3 సీహెచ్‌పీలో మంగళవారం ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్ ప్రణాళికలు, ముందున్న సవాళ్లు, కంపెనీ లక్ష్యాలను సాధించడానికి ఏం చేయాలి, తదితర అంశాలపై మల్టీ డిపార్ట్‌మెంటల్ టీం సభ్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు వివరించారు. సీహెచ్‌పీలో పనిచేస్తున్న ఉద్యోగులు బొగ్గు నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే సంస్థకు లాభాలు వస్తాయన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు జీగురు రవీందర్, మల్టీ డిపార్ట్‌మెంట్ సభ్యులు ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ఎస్‌వోటూ జీఎం ఎం.రాముడు, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఫైనాన్స్ అధికారి తిరుపతిరెడ్డి, సీహెచ్‌పీ ఎస్ఈ సదానందం, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే ధ్యేయంగా పనిచేయాలి



రోలింగ్ షీల్డుతో జీఎం లలిత్‌కుమార్, అధికారులు

గోదావరిఖని: రక్షణతో కూడిన ఉత్పత్తే ధ్యేయంగా కార్మికులు పనిచేయాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. జీడీకే–5 ఓసీపీలో సింగరేణి స్థాయి 55వ రక్షణ పక్షోత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. రక్షణ పాటించిన తర్వాతే ఉత్పత్తిపై దృష్టి సారించాలన్నారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ అమలు చేయాలని, పనిపై స్పష్టమైన అవగాహన వచ్చిన తర్వాతే పనిలో నిమగ్నం కావాలని సూచించారు. ఈ సందర్భంగా స్టోర్, ఉపరితల గని క్వారీ, హాలేజీ దారి, డంపర్, షావల్స్ తదితర వాటిని ఆయన సందర్శించారు. రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్పొరేట్ సేఫ్టీ బృందం జీఎం నారాయణరావు, కమిటీ సభ్యులు, ఓసీపీ–5 ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, సేఫ్టీ ఆఫీసర్ పానుగోటి శ్రీనివాస్, మేనేజర్ రమేశ్‌బాబు, ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం పాల్గొన్నారు.



సుల్తానాబాద్: మెట్ల పూజలో అయ్యప్పస్వాములు




యైటింక్లయిన్‌కాలనీలో పడిపూజ

అయ్యప్పస్వామి మెట్లపూజ


సుల్తానాబాద్: పట్టణంలో ముదిరాజ్ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి, అయ్యప్పస్వాముమలు గరిగె శ్రీనివాస్ ఇంటి ముందు మెట్ల పూజ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. లక్ష్మీదేవితో పాటు అయ్యప్ప దేవతా మూర్తులను ప్రతిష్ఠించి పాటు పలు రకాల పూజలు చేశారు. కేరళ పూజారి ప్రదీప్‌కుమార్ కలశపూజతో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప దీక్షాపరులకు ఆశీర్వచనం అందజేశారు. మాజీ ఎంపీపీ ఐల రమేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్, గురుస్వాములు మాటేటి శ్రీనివాస్, స్థానికులు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ రాణి రుద్రమదేవి సర్కిల్ చౌరస్తాలో సోమవారం రాత్రి మహా పడిపూజ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీశ్రీ చక్రవర్తుల పురోషోత్తమ గురుస్వామితో గండి వసంతలక్ష్మి–సదానందం దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి పడిపూజలో పాల్గొన్నారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాణి రుద్రమ్మదేవి సర్కిల్ చౌరస్తా మహిళా బృందం, అయ్యప్ప దీక్షా స్వాములు పాల్గొన్నారు.



ధర్మారం: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



మంథనిలో..

క్షీరాభిషేకం

మంథని: తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చినందుకు నిరసనగా మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు మంథనిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక పాత పెట్రోల్ బంక్ ఎదుట ఉన్న విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు.

ధర్మారం: మండల కేంద్రంతో పాటు మండలంలోని నందిమేడారంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

రామగిరి: మండలంలోని కల్వచర్లలో బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.